సాక్షి
కాకినాడ
బుధవారం ၊ 15 ၊ ఫిబ్రవరి ၊ 2023



హాకీ సంగ్రామానికి ఏర్పాట్లు పూర్తి

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన బుధవారం నుంచి కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.


8లో



రత్నగిరి సందర్శన

అన్నవరం: రత్నగిరిపై శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారిని మంగళవారం సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. నవదంపతులు, వారి బంధువులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 8.70 అడుగులుగా నమోదైంది.

చివరి గింజనూ కొనేశారు

- ధాన్యం రైతుల కళ్లల్లో ఆనందం
- రికార్డు స్థాయిలో కొనుగోళ్లు
- కొనసాగుతున్న ధాన్యం సేకరణ
- మూడు వారాల్లోనే ఖాతాల్లో సొమ్ము
- కోనసీమలో అదనంగా కొనుగోలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఖరీఫ్ వరి కోతలు మొదలయ్యేసరికి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుపై రైతుల్లో అనేక అనుమానాలు.. కొనుగోలు చేసినా సమయానికి ఖాతాకు సొమ్ము జమవుతుందా లేదా అనే ఆందోళన.. గత ప్రభుత్వాల్లో మాదిరిగా అయినకాడికి కమీషన్ ఏజెంట్లకు అమ్మేసుకోవాల్సి వస్తుందనే దిగులు.. ఈ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే ఒక్క మాట చెప్పారు. పండించిన ప్రతి ధాన్యం గింజనూ కనీస మద్దతు ధరకు కొని తీరుతామని అన్నారు. ఆ మాట ఆచరణ సాధ్యం చేసి చూపారు. ధాన్యం సేకరణ మొదలైనప్పటి నుంచి వారంలో రెండుసార్లు ఆయనే నేరుగా ఉమ్మడి తూర్పు గోదావరిలోని ముగ్గురు జిల్లా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహించారు. సేకరణ ఒక కొలిక్కి వచ్చే వరకూ ఒక రకంగా వెంట పడ్డారనే చెప్పాలి. అందువల్లే ఖరీఫ్ ధాన్యం సేకరణ విజయవంతంగా, సంపూర్ణంగా ముగిసింది. ఈ వాస్తవం గణాంకాలతో సహా నిరూపితమవుతున్నా పచ్చ పత్రికలు మాత్రం బురద జల్లుతూనే ఉన్నాయి.

విజయవంతం ఇలా..

- ఈసారి ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ప్రమేయాన్ని ప్రభుత్వం పూర్తిగా నియంత్రించింది.
- గతానికి భిన్నంగా ఆర్‌బీకేల ద్వారా నేరుగా కళ్లాల్లోనే ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించారు.
- కళ్లాల నుంచి మిల్లు వరకూ రవాణా చార్జీలు కూడా పారదర్శకంగా రైతుల ఖాతాలకు జమ చేశారు.
- చంద్రబాబు హయాంలో రైతుల నుంచి ధాన్యం సేకరించిన మూడు నాలుగు నెలలకు గాని రైతుల ఖాతాకు డబ్బులు జమయ్యేవి కావు. కొందరు రైతులకైతే ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేస్తే రబీ సీజన్ వరకూ కూడా నిరీక్షించాల్సి వచ్చేది. ఈలోపు వ్యవసాయ పెట్టుబడుల కోసం కమీషన్ ఏజెంట్లు, ఎరువుల దుకాణాల యజమానుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయడం రైతులకు తప్పేది కాదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో...

సేకరణ లక్ష్యం	7,94,000లు (మెట్రిక్‌టన్నుల్లో)
సేకరించిన ధాన్యం	7,53,277 (మెట్రిక్‌టన్నుల్లో)
ధాన్యం విక్రయించిన రైతులు	1,49,656 మంది
కొనుగోలుచేసిన ధాన్యం విలువ	రూ. 1,536.04 కోట్లు
రైతుల ఖాతాలకు జమ	రూ. 1,445.82 కోట్లు
రైతులకు చెల్లించిన రవాణా చార్జీలు	రూ. 6.51 కోట్లు
ఇంకా జమ కావాల్సిన సొమ్ము	రూ.90.22 కోట్లు

- ఈ సీజన్‌లో ప్రభుత్వం నూతన విధానాలను అనుసరించడం ద్వారా రైతుల ఇబ్బందుల నుంచి గట్టెక్కించింది.
- 90 నుంచి 95 శాతం మందికి మూడు వారాలు దాటకుండానే సొమ్ము జమ చేయడంలో సఫలీకృతమైంది.



మండపేటలో మిల్లుకు ధాన్యం తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

కొనుగోలుకు మళ్లీ అనుమతి

ఇంకా రైతుల వద్ద ఇంకా ధాన్యం ఉందని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు వ్యవసాయ మిషన్ డైరెక్టర్ జిన్నూరు బాబీ తదితర రైతు ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ జిల్లాలో అదనపు కొనుగోలుకు సైతం సీఎం అనుమతించారు. గత నెలలో అదనంగా 5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఆదేశాలు జారీ అయ్యాయి. నాటి నుంచి ఇప్పటి వరకూ అదనంగా 6,763 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం రైతులకు ఊరటనిచ్చింది. ఈ అదనపు లక్ష్యం మేరకు కొనుగోలు చేసిన రెండు వారాలకే రూ.59.76 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఇప్పటికీ సేకరణ కొనసాగుతోంది. కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల రైతులు సన్న రకాలను పొలాల్లోనే కుప్పలుగా వేసుకున్నారు. ప్రస్తుతం అపరాల మాసూళ్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నెలాఖరు వరకూ ధాన్యం సేకరించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

కళ్లాలకే వచ్చి కొనుగోలు

ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసింది. సీజన్ ముగుస్తున్నా ఇంకా అక్కడక్కడ మిగిలి ఉన్నా కొనుగోళ్లు కొనసాగిస్తూనే ఉంది. లక్ష్యానికి అనుగుణంగా 90 నుంచి 95 శాతం సేకరణ పూర్తవ్వడంతో రైతులు సంతోషంగా కనిపిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా గత ఏడాది నవంబర్ మొదటి వారంలో ధాన్యం సేకరణ మొదలైంది. సీజన్ ముగింపు దశకు చేరుకున్నా రైతుల విజ్ఞప్తితో ఈ నెలాఖరు వరకూ ప్రభుత్వం కొనసాగిస్తోంది. మునుపెన్నడూ ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో సేకరణ విషయంలో సరికొత్త రికార్డు సృష్టించింది. మద్దతు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా రైతుల ఖాతాలకు సకాలంలో సొమ్ములు జమ చేయడంలో కూడా గత రికార్డులను తిరగరాసిందని చెప్పవచ్చు. పునర్విభజన అనంతరం ఏర్పడిన మూడు జిల్లాల్లోనూ అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పోటీ పడ్డారు. కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తామని సీజన్ ప్రారంభంలోనే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. చెల్లింపు విషయంలోనూ అదే చెప్పారు. అందుకు తగ్గట్టుగానే కొనుగోలు చేసిన మూడో రోజు నుంచే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడం మొదలైంది. ప్రభుత్వం నిర్దేశించిన 21 రోజుల గడువులోగా జమ చేయడంతో రైతుల్లో ఆనందం తొణికిసలాడుతోంది.

ఐదు రోజుల్లోనే సొమ్ములు



కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇచ్చింది. ఖరీఫ్‌లో 33.2 క్వింటాళ్ల వరి దిగుబడి వచ్చింది. దళారులకు తక్కువ రేటుకు ఇవ్వకుండా ఆర్‌బీకే ద్వారా విక్రయించాం. క్వింటాల్‌కు రూ.2,040 చొప్పున గత నవంబర్ 18న విక్రయించాను. ఐదు రోజుల్లోనే నా ఖాతాలో రూ.67,728 జమ అయ్యింది. దళారులయితే తక్కువ రేటుతో పాటు చాలా రోజుల వరకూ సొమ్ము ఇచ్చేవారు కాదు.

– బండారు ఆంజనేయులు, కొవ్వాడ, కాకినాడ రూరల్

ఇలా కొన్నారు.. అలా డబ్బులు పడ్డాయి



నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఆర్‌బీకే ద్వారా సుమారు 90 క్వింటాళ్ల ధాన్యం మిల్లుకు తరలించాం. ఈసారి తొమ్మిది రోజుల్లోనే ధాన్యం సొమ్ము బ్యాంకులో పడటం ఆనందంగా ఉంది. గతంలో రెండు మూడు నెలలకు పైగా పట్టేది. దళారుల జోక్యం లేకుండా సొసైటీ సిబ్బందే నేరుగా ధాన్యం కొనుగోలు చేశారు.

– చిరుకూరి సుబ్రహ్మణ్యం, కేశవరం, మండపేట మండలం

ఆర్బీకేలకు అమ్మడం మంచే జరిగింది



వరిలో మంచి దిగుబడి సాధించి, కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకోవడంతో కనీస మద్దతు ధర లభించింది. నాలుగు ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశాను. ఎకరానికి 36 కాటాల వరకూ దిగుబడి వచ్చింది. ఆర్‌బీకే ద్వారా ధాన్యం అమ్ముకున్నాను. అమ్మిన ఐదో రోజునే నా బ్యాంక్ ఖాతాలో రూ.2.17 లక్షలు జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– ఎస్.దుర్గారావు, సీతానగరం

రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- రూ.7.43 కోట్లతో నిర్వహణ పనులు
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడి



కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రబీ పంటకు నీటి ఎద్దడి లేకుండా రూ.7.43 కోట్లతో వివిధ నిర్వహణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించింది. ఇందుకు నిధుల మంజూరు చేసినట్లు కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం విలేకర్లకు తెలిపారు. తూర్పు డివిజన్, కాకినాడ డ్రైనేజీ డివిజన్, ఏలేరు డివిజన్ల పరిధిలోని డ్రైన్లపై క్రాస్ బండ్ల ఏర్పాటు, కాల్వల నుంచి మోటార్లతో లిఫ్టింగ్, తూడు తొలగింపు తదితర పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. తూర్పు డివిజన్ పరిధిలో 43 పనులకు రూ.3.38 కోట్లు మంజూరయ్యాయన్నారు. దీనిలో భాగంగా కొంగోడు, పెద్దాపురప్పాడు, యండమూరు, రేపూరు, జగన్నాయకపూర్, భీమనకర్ర, కరప బోదె, సంపరబోదె, కేఎంజీ కెనాల్, దుగ్గుదూరు, ఉప్పుమిల్లి, కాజులూరు, జగన్నాథగిరి, వెల్ల సౌత్, కోలంక, దంగేరు, తాళ్లపూడి, బిక్కవోలు ఛానళ్ల నుంచి మోటార్ల నుంచి లిఫ్ట్ చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

పెద్దాపురం డివిజన్ పనులు

పెద్దాపురం-ఏలేరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని 18 పనులకు రూ. 68.58 లక్షలు మంజూరయ్యాయన్నారు. పిఠాపురం-1, గొల్లప్రోలు, లొద్దులపాటి కాలువ, గొర్రిఖండి, పాటికాల్వ, వీర్రాజు కాలువ, ఉబండ డ్రెయిన్, ఉప్పుటాంకు స్లూయిస్, ఆర్‌ఆర్‌బి ట్యాంక్ ఆఫ్ టేక్ స్లూయిజ్, పీబీసీ పరిధిలోని పాత ఏటికాలువ, వాలుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగిస్తారన్నారు. గుమ్మిడిగడ్డ, నడిమేరు, రిగ్యులేటర్, పాటి కాలువ, వెస్ట్ ఏలేరు డ్రెయిన్, నాగులాపల్లి కళింగల, తమ్మవరం శివారు కళింగల, ఆర్‌ఆర్‌బీ సర్‌ప్లస్ వియర్-1, 2, ఉప్పు ట్యాంకు వియర్, నక్కలఖండి డ్రైన్లపై క్రాస్ బండ్ల ఏర్పాటు, పీబీసీ మెయిన్ కెనాల్ రైట్ సైడ్ గట్టు పటిష్టీకరణ, గొల్లప్రోలు వద్ద నక్కలఖండి డ్రెయిన్ గండి పూడిక నిమిత్తం నిధులు మంజూరైనట్లు కలెక్టర్ వివరించారు.

కాకినాడ డివిజన్ పరిధిలో..

కాకినాడ డ్రైనేజీ డివిజన్ పరిధిలో 40 పనులకు రూ.3.36 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిలో భాగంగా వెస్ట్ ఏలేరు మేజర్ డ్రైన్, కైవోలు, గాడేరు, తూటేరు, భావారం, మామిడికట్ట, పెదపూడి సెక్షన్-2, అనపాలమ్మ మీడియం డ్రెయిన్, చెంబాడ మైనర్, రెల్లుబాడవ మైనర్, బోడివరం మీడియం, తాడిపల్లి మీడియం, పాతర్లగడ్డ మీడియం, తూరంగి మైనర్, నడకుదురు మైనర్, పెనుగుదురు మైనర్, సహపురం మీడియం, కరప మైనర్, కాండ్రేగుల మైనర్, చిన మామిడాడ మీడియం, చింతపల్లి మైనర్, టీబీ మైనర్, రాజు మీడియం, యండమూరు మీడియం, వెంకటేశ్వర్లు మైనర్ తదితర 40 డ్రెయిన్లపై క్రాస్ బండ్ల ఏర్పాటు పనులు మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులన్నింటినీ సత్వరం చేపట్టి రైతుల రబీ పంటలకు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ శుక్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

ఆలయ భూములు

అన్యాక్రాంతమైతే చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దేవదాయశాఖ పరిధిలోని సత్రాలు, ఆలయ భూములు అన్యాక్రాంతమైతే సంబంధిత ఈవోలపై చర్యలు తప్పవని ఆశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు తెలిపారు. కాకినాడలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జగనన్న భూ సర్వేలో దేవాలయ భూముల సర్వే విషయంపై ఈఓలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు అన్యాక్రాంతమైన భూములపై ఆయన సమీక్షించారు. ఇకపై సర్వే జరిగిన రోజుల్లో ఆయా ఈఓలు తప్పకుండా భూములు ఉన్న గ్రామాలకు వెళ్లి ఆయా గ్రామ వీఆర్వోలను కలుసుకుని భూముల సర్వే నెంబర్లు ముందుగా ఇవ్వాలన్నారు. సర్వేలో భూమి నమోదు కాకుంటే దానికి గల కారణాలు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఆక్రమణలకు గురైన భూములను చేజిక్కించుకోవడం కష్టమైన వ్యవహారమని, ఈ విషయాన్ని గుర్తించి ఈఓ సంబంధింత రెవెన్యూ అధికారులతో సమావేశమై సక్రమంగా సర్వే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు వడ్డి ఫణికుమార్, ఉదయకుమార్‌బాబు, ఈఓలు, దేవదాయశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.



ఈఓల సమావేశంలో విజయరాజు

ఈ శివరాత్రికి ప్రభంజనమే

- మూడు పర్వదినాలు ఒకే రోజు
- భారీగా తరలి రానున్న భక్తులు
- బందోబస్తు చర్యలలో పోలీసులు
- అందరికీ దర్శనమయ్యేలా ఏర్పాట్లు

పిఠాపురం: ఈసారి మహా శివరాత్రి ఉత్సవాలకు మునుపెన్నడూ లేనివిధంగా జనం పోటెత్తనున్నారు. 22 ఏళ్ల తరువాత శని త్రయోదశి శివరాత్రి నాడే పడింది. పుణ్య స్నానాలతో పాటు శని త్రయోదశి పూజల వల్ల ఆలయాలు కిటకిటలాడనున్నాయి. పిఠాపురం పాదగయ, సామర్లకోట భీమేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. సాధారణంగా శివరాత్రి రోజున పుణ్యస్నానం చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది శనిత్రయోదశి కలిసి రావడంతో శనీశ్వరునికి కూడా పూజలు చేస్తారు. దీనికి తగ్గట్టుగా ఆలయాల వద్ద బందోబస్తు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానాలు చేయడం ఆనవాయితీ. భక్తులు వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. శని త్రయోదశి పూజలు కూడా చేస్తారు. పాదగయ క్షేత్రం 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉండగా సామర్లకోట భీమేశ్వరాలయం కాకినాడ రాజానగరం మెయిన్ రోడ్డును ఆనుకుని ఉండడంతో వాహనాల రద్దీ పెరుగుతుందని భావిస్తున్నారు. ముందుగానే వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించక పోతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయి. సాధారణ రోజుల్లో మహా శివరాత్రి నాడు పాదగయ, సామర్లకోట ఆలయాలకు 2 లక్షల నుంచి 3 లక్షల మంది వరకూ భక్తులు వస్తుంటారు. విశేష పర్వదినం తోడవ్వడంతో ఈ సంఖ్య రెట్టింపుయ్యే అవకాశాలున్నాయి.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పోటెత్తిన భక్తులు (ఫైల్)



వాహనాలతో నిండిపోయిన పాదగయ క్షేత్రం పరిసరప్రాంతం(ఫైల్)

ఇది అపూర్వ పర్వదినం



22 ఏళ్ల అనంతరం శని త్రయోదశి (శనివారం), మాస శివరాత్రి, మహా శివరాత్రి మూడు పర్వదినాలు ఒకే రోజు వస్తున్నాయి. ఇది అపూర్వ పర్వదినంగా భక్తులు భావిస్తారు. భక్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరు పుణ్య స్నానంతో పాటు శనీశ్వర పూజలకు ప్రాధాన్యం ఇస్తారు. తైలాభిషేకాలు ఎక్కువగా నిర్వహిస్తారు. శని దోష నివారణ పూజలు తప్పనిసరిగా చేయనుండడంతో భక్తుల సంఖ్య ఎప్పుడూ లేనంతగా ఉంటుంది.

అల్లంరాజు చంద్రమౌళి, అభిషేక పండిట్, పాదగయ క్షేత్రం

బందోబస్తు పెంచుతాం



ఈఏడాది మహాశివరాత్రికి బందోబస్తు పెంచాలని యోచిస్తున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశాం. మూడు పర్వదినాలు ఒకే రోజు రావడంతో భక్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. దానికి తగ్గట్టుగా బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నాం. ఆలయానికి దూరంగా పార్కింగ్ ప్రదేశాలు గుర్తిస్తున్నాం. జాతీయ రహదారిపై వాహనాలను దారి మళ్లించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

తైలాభిషేకాలకు ప్రత్యేక క్యూ



మహా శివరాత్రి రోజున శని త్రయోదశి రావడంతో తైలాభిషేకాలకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నాం. శనీశ్వర పూజలకు ఆలయ ప్రాంగణంలోని స్వామివారి కల్యాణ మండప ప్రదేశంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఎక్కువ సమయం ఆలయ ప్రాంగణంలో ఉండకుండా త్వరితగతిన పూజలు పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిస్తాం. క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. పాదగయ పుష్కరిణి వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నాం.

ఆర్ సౌజన్య, ఈఓ, పాదగయ క్షేత్రం

యువకుడిని కాపాడిన ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గోదావరిలో దూకబోయిన యువకుడిని ఎంపీ మార్గాని భరత్ రామ్ చాకచక్యంగా కాపాడారు. స్థానిక రోడ్డుకం రైల్వే వంతెనపై మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నిడదవోలు మండలం ఉనకరమిల్లికి చెందిన అయ్యప్ప ఎలక్ట్రికల్ అండ్ ఇంజినీరింగ్ పూర్తిచేసి జడ్చర్లలోని అరబిందో ఫార్మసీలో మూడేళ్లు పనిచేశాడు. మంగళవారం బైక్‌పై రోడ్డు కం రైలు వంతెనపైకి వచ్చాడు. మోటారు సైకిల్‌ను పక్కనపెట్టి బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయంలో గోపాలపురంలో ఒక శుభ కార్యక్రమానికి బయల్దేరిన ఎంపీ భరత్‌రామ్ ఈ విషయాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, కారులోంచి బయటకు దూకి, ఆ యువకుడిని పట్టుకుని రోడ్డు మీదుకు లాగారు. ఎంపీ అనుచరులు కూడా గట్టిగా పట్టుకున్నారు. ఎంపీ వెంటనే రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ గణేష్‌కు ఫోన్‌చేసి విషయం తెలిపారు. ఆ యువకుడిని ఆటోలో రెండోపట్టణ పోలీసుస్టేషకు తీసుకువెళ్లారు. యువకుడిని కాపాడిన ఎంపీ భరత్‌రామ్‌ను పలువురు అభినందించారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను మంగళవారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ పరిశీలించారు. పనులు చేస్తున్న సృష్టి కాంట్రాక్టు ప్రైవేటు లిమిటెడ్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్ గౌడ్‌తో ఎంపీ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. జాప్యం చేయకుండా శరవేగంగా నిర్వహించాలని, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు నిర్వహించాలన్నారు. ఎంపీ భరత్‌రామ్ వెంట పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, గుర్రం గౌతమ్, మార్గాని చంటిబాబు ఉన్నారు.

న్యూస్‌రీల్

అంబటి ఆయిల్స్ ప్రధాన ఫ్యాక్టరీలో తనిఖీలు



సామర్లకోట అంబటి ఆయిల్స్‌లో వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక బృందం

సామర్లకోట: స్థానిక అంబటి సుబ్బన్న ఆయిల్ ప్రధాన ఫ్యాక్టరీని ప్రత్యేక బృందం మంగళవారం తనిఖీ చేసింది. పెద్దాపురం మండలం జి. రాగంపేటలోని అంబటి ఆయిల్ బ్రాంచిలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు ఐదుగురు సభ్యులతో కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇప్పటికే ప్రమాదం జరిగిన ఫ్యాక్టరీని సందర్శించింది. తాజాగా ఆయిల్ తయారీ, ప్యాకింగ్ విధానాలను పరిశీలించింది. కోవిడ్ నుంచి మెషీన్ల ద్వారా ఆయిల్ ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించారు.

ఆ బంగారు గొలుసు దేవునికి సమర్పణ



హుండీలో గొలుసు వేస్తున్న దేవస్థానం అధికారులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిన జారవిడుచుకున్న బంగారు గొలుసు కోసం ఎవరూ తమదని రాకపోవడంతో అధికారులు మంగళవారం దేవస్థానం హుండీలో వేశారు. గత నెల 29న స్వామివారి ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి సుమారు 12 గ్రాముల బరువు గల బంగారు గొలుసు దొరికింది. దాని వివరాలు తెలియచేసి తీసుకువెళ్లాలని అధికారులు మర్నాడు పత్రికా ముఖంగా కోరారు. రెండు వారాలు గడిచినా స్పందన రాకపోవడతో మంగళవారం సత్యదేవుని ఆలయం వద్ద గల హుండీలో ఆ గొలుసును వేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 80 మంది ఎంపిక



మాట్లాడుతున్న హెచ్‌ఆర్ విజయకుమార్ రెడ్డి

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 80 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కె.వీర్రాజు మంగళవారం తెలిపారు. ఇంటర్వ్యూలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు నిర్వహించిన రాత పరీక్షల్లో 121 మంది అర్హత సాధించారు. తదుపరి విభాగంలో 80 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులు క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎనాలసిస్, ప్రొడక్షన్ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుందని హెటిరో డ్రగ్స్ హెచ్‌ఆర్ ప్రతినిధి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను శ్రీప్రకాష్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకె నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

రికార్డులు పారదర్శకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటరమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష, రీసర్వే రికార్డులు పారదర్శకంగా రూపొందించాలని ఆర్డీవో బీవీ రమణ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో 121 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో రికార్డుల స్వచ్ఛీకరణ పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డుల రూపకల్పనకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యాలయ పరిపాలనా అధికారి జి.వరహాలయ్య, డివిజనల్ టెక్నికల్ మేనేజర్ దుర్గాప్రసాద్, తహసీల్దారులు, డిప్యూటీ తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజమహేంద్రవరం - విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: కరోనా కారణంగా గతంలో నిలిచిపోయిన రాజమహేంద్రవరం - విశాఖపట్నం ప్యాసింజరు రైలు స్థానంలో రెండేళ్ల తరువాత ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కింది. దీనిని రాజమహేంద్రవరంలో రైల్వే స్టేషన్ మేనేజర్ గంగాప్రసాద్, క్రూ కంట్రోలర్ బీవీబీకే రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. రాజమహేంద్రవరం – విశాఖపట్నం – రాజమహేంద్రవరం మధ్య ప్రతి రోజూ ఈ రైలు నడుస్తుంది. 07566 నంబర్ రైలు రాజమహేంద్రవరంలో ప్రతి రోజూ ఉదయం 9.25 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరిగి 07567 నంబరుతో విశాఖపట్నంలో సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి రాత్రి 11.35 గంటలకు రాజమహేంద్రవరం చేరుతుంది. మార్గం మధ్యలో ఈ రైలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కడియం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, మేడపాడు, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, అన్నవరం, రావికంపాడు, హంసవరం, తుని రైల్వేస్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

బావిలో పడి వ్యక్తి మృతి

పెద్దాపురం: ప్రమాదవశాత్తూ బావిలో జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దాపురం ఎస్సై వెలుగుల సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని పులిమేరు గ్రామానికి చెందిన జెట్టి శ్రీనివాస్ (38) స్థానిక ఈశ్వరమ్మ గుడి సమీపాన ఉన్న కిళ్లీ కొట్టు వద్ద మంగళవారం సాయంత్రం సోడా తాగి ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. అప్పటికే నీరసంగా ఉన్న అతడు మార్గం మధ్యలో ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న బావిలోకి జారి పడ్డాడు. ప్రమాదం జరిగిన చాలాసేపటికి కానీ ఎవరూ గమనించకపోవడంతో బావిలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య వీర సత్యవతి, కుమార్తె హేమ, కుమారుడు శ్రీరామ్ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాలలో ఉద్యోగాలు

కాకినాడ క్రైం: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (1962 టోల్‌ఫ్రీ నెంబర్) ఆధ్వర్యంలో ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పరిధిలో వివిధ పోస్టుల భర్తీకి మంగళవారం ప్రకటన వెలువడింది. ఉమ్మడి జిల్లాలో వెటర్నరీ డాక్టర్లు 10, పేరావెయిట్స్–5, డ్రైవర్లు–15 పోస్టులు భర్తీ చేయనున్నారు. వెటర్నరీ వైద్య పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ అర్హత ఉండాలి. ఫ్రెషర్లతో పాటు విశ్రాంత పశువైద్యులు కూడా అర్హులు. ఇంటర్వ్యూలు కాకినాడ వెటర్నరీ హాస్పిటల్‌లో జరుగుతాయి. వివరాలకు 91605 66668 నంబర్‌లో సంప్రదించాలని డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల జిల్లా మేనేజర్ మోహన్ గాంధీ కోరారు.

ఘన చరితకు చెరగని గురుతులు

- యానాంలో ఫ్రెంచి పాలనకు ఆనవాళ్లెన్నో..
- వారసత్వ గుర్తింపునకు నోచని కట్టడాలు



ఫ్రెంచి వారు నిర్మించిన రోమన్ కేథలిక్ చర్చి (అంతరచిత్రం) చర్చి లోపలి భాగం

యానాం: పర్యాటకుల స్వర్గధామంగా విలసిల్లుతున్న ప్రాంతం యానాం. ఇక్కడ ఆకట్టుకునే, ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి అందాలెన్నో ఉన్నాయి. గోదావరి సాగర సంగమ ప్రాంతం, పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను పోలి ఉండే ఓబ్లిస్క్ టవర్, రాజీవ్ బీచ్.. ఇలా అనేక పర్యాటక ఆకర్షణలు ఇక్కడ కొలువుతీరాయి. వీటితో పాటు ఘనమైన ఈ ప్రాంత చరిత్రను గుర్తు చేసే.. వలస పాలనకు సాక్ష్యంగా నిలిచే ఆనవాళ్లెన్నో యానాంలో ఉన్నాయి. ఫ్రెంచి నిర్మాణ శైలిలో ఉండే ఈ కట్టడాలు సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటాయి. యానాం.. భౌగోళికంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యన ఉన్నప్పటికీ.. పాలనా పరంగా కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి పరిధిలో ఉంది.

ఫ్రెంచి పాలనకు సాక్షిగా..

దాదాపు మూడు శతాబ్దాల కిందట ఫ్రెంచి వారు వ్యాపార అవసరాల నిమిత్తం మన దేశానికి వచ్చారు. సముద్ర తీరం గుండా మన గడ్డపై కాలు మోపి.. వ్యాపారం సాగించడంతో పాటు పరిపాలనను సైతం హస్తగతం చేసుకున్నారు. 1723 నుంచి రెండు శతాబ్దాల పాటు ఇక్కడ వారి ఏలుబడి సాగింది. పాలన సజావుగా సాగించడానికి వీలుగా వారికి అవసరమైన అనేక మౌలిక సౌకర్యాలు సమకూర్చుకున్నారు. ఇందులో భాగంగా ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్ నమూనాలో పలు కట్టడాలను నిర్మించారు. స్వాతంత్య్రం అనంతరం ఫ్రెంచి వారు 1954లో పుదుచ్చేరిని భారత దేశంలో విలీనం చేశారు. అనంతర కాలంలో వారు నిర్మించిన కొన్ని భవనాలు శిథిలమైపోయాయి. సుమారు 10 వరకూ నిర్మాణాలు మాత్రం ఇప్పటికీ ఫ్రెంచి వారసత్వ చిహ్నాలుగా సజీవంగానే మిగిలి ఉన్నాయి.

వారసత్వ గుర్తింపు ఇవ్వాలి

పుదుచ్చేరిలో ఫ్రెంచి వారు నిర్మించిన భవనాలు వందకు పైగా ఉన్నాయి. వీటిలో 36 ప్రభుత్వ స్వాధీనంలో, 60 అరబిందో ఆశ్రమ ఆధీనంలో ఉండగా మరో 9 ఇప్పటికీ ఫ్రెంచి ప్రభుత్వ నిర్వహణలోనే ఉన్నాయి. వీటన్నింటికీ స్టేట్ లెవెల్ హెరిటేజ్ కన్జర్వేషన్ భవనాలుగా పుదుచ్చేరి ప్రభుత్వం ఇటీవల నోటిఫై చేసింది. ఈ భవనాలకు ప్రపంచ వారసత్వ గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది కూడా. ఇదేవిధంగా యానాంలోని ఫ్రెంచి కట్టడాలకు కూడా వారసత్వ గుర్తింపు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోమన్ కేథలిక్ చర్చి

1789లో వచ్చిన తుపానుకు కోరంగి వద్ద ఉన్న ఓ చర్చి కూలిపోయింది. ఆ ప్రమాదంలో ఆ చర్చి ఫాదర్ మృతి చెందారు. ఆ తరువాత ఆ చర్చికి సంబంధించిన పవిత్ర పాత్ర (చాల్ ఐస్), సెయింట్ ఆన్ విగ్రహం తుపానుకు కొట్టుకువచ్చాయని, వాటితో యానాంలో సెయింట్ ఆన్స్ రోమన్ కేథలిక్ చర్చి నిర్మాణం జరిగిందని చరిత్ర చెబుతుంది. అనంతరం ఈ చర్చి పునర్నిర్మాణం 1839, 1845, 1857 సంవత్సరాల్లో జరిగిందని రికార్డులు చెబుతున్నాయి. సూడసీస్ పద్ధతిలో నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. దీనిని పర్యాటక నిధులు రూ.80 లక్షలతో ఇటీవల ఆధునీకరించారు.

ఫ్రెంచి సమాధులు


ఫ్రెంచి వారి సమాధులు

ఆ కాలంలో ఉద్యోగ, వ్యాపార రీత్యా యానాం వచ్చిన ఫ్రెంచి వారు ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ కాలంలో అనారోగ్యం, వృద్ధాప్యం తదితర కారణాలతో మృతి చెందిన ఫ్రెంచి వారిని మెట్టకూరు మార్గంలో ఉన్న ఫ్రెంచి సెమెటరీలో ఖననం చేసేవారు. ఫ్రెంచి టీచర్లు, మిషనరీల నుంచి వచ్చి సిస్టర్లు, వ్యాపారులు, పెద్ద దొరలు, నౌకాధికారులు, జడ్జీలు, సైనికాధికారుల సమాధులు ఇక్కడ ఉన్నాయి. వారి సమాధులపై ఉన్న ఫలకాలను అధ్యయనం చేసిన ఔత్సాహికులు.. 1820 నుంచి ఉన్న సమాధులు, మృతుల వివరాలతో ఓ పుస్తకం కూడా రాశారు.

మరెన్నో..

- 19వ శతాబ్దం ప్రారంభంలో యానాం ప్రాంతాన్ని తుపానులు, వరదలు, ఉప్పెనల వంటి ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తాయి. వీటి నుంచి రక్షణ కోసం 1834లో యానాం పట్టణం చుట్టూ 300 మీటర్ల మేర గోడ నిర్మించారు.
- ప్రస్తుతం పరిపాలన సాగిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ బంగ్లా ఫ్రెంచి కాలం నాటిదే.
- 1848లో నిర్మించిన మసీదు.
- ఫ్రెంచి భాషా సంస్కృతులను పెంపొందించేందుకు 1894లో ×సర్కిల్ ది యానాం× భవనం నిర్మించారు.
- ప్రస్తుతం ఉన్న సబ్ కోర్టు భవనాన్ని సైతం 1725లో నిర్మించారు.
- పరిపాలనా కార్యాలయం వద్ద ఉన్న జెండా స్తంభం కూడా ఫ్రెంచి వారి కాలంలో నిర్మించినది కావడం విశేషం.


ఫ్రెంచి వారు నిర్మించిన కోర్టు భవనం

ఫ్రెంచి భవనాలను పరిరక్షించాలి



ఫ్రెంచి కాలం నాటి భవనాలకు పుదుచ్చేరి ప్రభుత్వం వారసత్వ కట్టడాలుగా గుర్తింపునిస్తోంది. యానాంలో ఉన్న ఫ్రెంచి భవనాలను సైతం వారసత్వ జాబితాలో చేర్చి, పరిరక్షించాల్సిన బాధ్యత పుదుచ్చేరి ప్రభుత్వంపై ఉంది.

– బొల్లోజు బాబా, చరిత్రకారుడు, అధ్యాపకుడు, యానాం

వారసత్వ గుర్తింపునకు కృషి



పుదుచ్చేరి ప్రాంతంలోని పలు ఫ్రెంచి కట్టడాలను పరిరక్షించే ప్రధాన ఉద్దేశంతో ఇటీవల వారసత్వ గుర్తింపు (హెరిటేజ్ భవనాలు) ఇచ్చారు. అదే విధంగా యానాంలోని ఫ్రెంచి కట్టడాలకు కూడా వారసత్వ గుర్తింపు ఇచ్చి పరిరక్షించాలి. ఈ విషయాన్ని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి దృష్టికి తీసుకువెళ్తాను.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

భక్తుల భద్రతకు ప్రాధాన్యం



టూరిస్టు పోలీసు స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

పిఠాపురం: ఆలయాల వద్ద భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టూరిస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. పాదగయ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన టూరిస్టు పోలీసు స్టేషన్‌ను సీఎం వైఎస్ జగన్ మంగళవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించగా.. ఎస్పీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాల సమాచారాన్ని బ్రోచర్ల రూపంలో ఇక్కడ అందుబాటులో ఉంచుతామన్నారు. భక్తులకు తగిన సమాచారం ఇవ్వడంతో పాటు పూర్తి రక్షణ కల్పించేందుకే టూరిస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా తగిన సహకారం అందిస్తారని ఎస్పీ తెలిపారు. దీని ద్వారా ఆలయానికి కూడా పూర్తి భద్రత కల్పించినట్లవుతుందన్నారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేటప్పుడు నదులు, పుష్కరిణుల్లో దూకడం, గెంతడం వంటివి చేసి, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న ఘటనలు జరుగుతున్నందున.. వీటిపై పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెడతారని వివరించారు. ఇప్పటి వరకూ ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం టూరిస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేసిందని, దీనిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని రవీంద్రనాథ్‌బాబు కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జిల్లా కమ్యూనికేషన్ సీఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఆహ్లాదం కలిగించేలా శివరాత్రి ఏర్పాట్లు


శివరాత్రి ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

సామర్లకోట: మహాశివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రమైన చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఆహ్లాదం కలిగించే విధంగా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. కాలభైరవ స్వామిని, పెద్ద నందిని దర్శించుకున్న ఆయన శివరాత్రి ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులను ఆకట్టుకునేలా పూలతో అలంకరణ చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ నెల 16వ తేదీ రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిగే ప్రదేశాలను విజయరాజు పరిశీలించారు. భక్తుల పుణ్యస్నానాలకు వీలుగా ఆలయ కోనేటిని స్వచ్ఛమైన నీటితో నింపాలని సూచించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను డీసీ దర్శించుకొని పూజలు చేశారు. తొలుత డీసీ బృందానికి ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


కల్యాణ్ మృతదేహం

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రు శివారు రాచబంద వద్ద పంట పొలాల్లో ఓ యువకుడు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడిని కె.గంగవరం మండలం తాళ్లపూడి శివారు అంబేడ్కర్ నగర్‌కు చెందిన కాటే కల్యాణ్(25)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న కల్యాణ్ ఈ నెల ఏడో తేదీన గ్రామానికి వచ్చాడు. తెలిసినవాళ్ల పెళ్లికి వెళ్తున్నానని చెప్పి, సోమవారం రాత్రి ఇంటి బయలుదేరిన అతడు మంగళవారం ఉదయం దుగ్గుదుర్రులో శవమై కనిపించాడు. పొలాల్లో పంపుసెట్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అతడు మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్, గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్‌లు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వరి పొలాల్లో ఎలుకల నిర్మూలనకు పలువురు రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తగిలి కల్యాణ్ మృతి చెంది ఉండవచ్చని కూడా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే అసలు కల్యాణ్ పంట పొలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఏముంటుందని, ఎవరో అతడిని హతమార్చి, మృతదేహాన్ని పొలాల్లో పడవేసి ఉండవచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం నివేదికలు వచ్చేంత వరకూ ఎటువంటి నిర్ధారణకూ రాలేమని, ప్రస్తుతానికి అనుమానాస్పద కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేటితో ముగియనున్న 'నవోదయ' గడువు

రాయవరం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల గడువు బుధవారంతో ముగియనుంది. తొలుత జనవరి 31వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. దీనిని ఫిబ్రవరి 8, అనంతరం 15వ తేదీ వరకూ పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం 10 గంటల సమయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3,270 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని సమాచారం. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 4,882 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈసారి 7,761 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది ఏకంగా 10,741 మంది దరఖాస్తు చేయగా, ఈ ఏడాది 11,815 మందితో దరఖాస్తు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. గడువు బుధవారంతో ముగియనుండగా మంగళవారం ఉదయం 10 గంటల సమయానికి 66 శాతం మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్లు


ఐఎస్ఓ ప్రతినిధులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: నాణ్యతా ప్రమాణాలు, ఫుడ్ సేఫ్టీకి సంబంధించి వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్లు లభించాయి. ఈ మేరకు ఐఎస్ఓ ప్రతినిధులు మంగళవారం ఆలయాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం, ప్రసాద వినియోగం, భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వీటిని నిర్వహిస్తున్నందున దేవస్థానానికి క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికెట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఐఎస్ఓ ప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి చైర్మన్, ఈఓలు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను బహూకరించారు.

హాకీ సంగ్రామానికి ఏర్పాట్లు పూర్తి

- 80 ఏళ్ల హాకీ చరిత్రలో తొలిసారి ఏపీలో నిర్వహణ
- 25 రాష్ట్రాల నుంచి రానున్న క్రీడాకారిణులు
- నేటి నుంచి 26 వరకూ పోటీలు


హాకీ పోటీలకు సిద్ధమైన యాస్ట్రో టర్ఫ్ మైదానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీల నిర్వహణకు యాస్ట్రో హాకీ టర్ఫ్ మైదానాన్ని నిర్వాహకులు సిద్ధం చేశారు. 80 ఏళ్ల హాకీ చరిత్రలో వుమెన్ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లో జరగడం ఇదే తొలిసారి. దీంతో నిర్వాహకులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలకు 25 రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారిణులు, కోచ్‌లు, మేనేజర్లు హాజరు కానున్నారు. వీరికి కాకినాడ డీఎస్ఏ, సూరంపాలెం ఆదిత్య, ఇంజినీరింగ్ హాస్టల్ భవనాల్లో వసతి ఏర్పాట్లు చేశారు. క్రీడా మైదానంలోనే భోజన సదుపాయం కల్పిస్తున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు హాకీ మైదానంలో ప్రత్యేక ఫ్లడ్ లైట్ సౌకర్యం కల్పించారు. వైద్య, ఆరోగ్య శాఖ, కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యాన వైద్య, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోటీల ఏర్పాట్లను హాకీ ఆంధ్రప్రదేశ్ సలహాదారు నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు చాణుక్య రాజ్, కార్యదర్శి హర్షవర్ధన్, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ వి.రవిరాజు మంగళవారం పరిశీలించారు.

'నన్నయ' సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక


పోటీల్లో విజేతగా నిలిచిన జి.మామిడాడ డీఆర్‌కే బీపీఈడీ కాలేజీ జట్టు

పెదపూడి: ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక జి.మామిడాడ డి.లక్ష్మణరెడ్డి డిగ్రీ కళాశాలలో సోమవారం రాత్రి నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని 9 కళాశాలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ చూపిన 16 మందిని అంతర్ విశ్వవిద్యాలయాల సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. వర్సిటీ స్థాయి పోటీల్లో డీఆర్‌కే ఫిజికల్ ఎడ్యుకేషనల్ కాలేజీ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో ఏలూరు సీఆర్ రెడ్డి, జి.మామిడాడ డీఎల్ఆర్, జంగారెడ్డిగూడెం కాలేజీ జట్లు నిలిచాయి. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌కే రెడ్డి విద్యాసంస్థల అధినేత డీఆర్‌కే రెడ్డి, కరస్పాండెంట్ ద్వారంపూడి వివేకనందారెడ్డి, డీఆర్‌కే బీపీఈడీ, డీఎల్ఆర్ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్ ఎంపీ కృష్ణారావు, టి.శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, పీడీలు గొలుగూరి వెంకటరెడ్డి, గౌరీ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఉత్తమ సేవలు


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీలు గీత, బోసు, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులు

సామర్లకోట: జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో మొదటిసారిగా కార్పొరేట్ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. సామర్లకోట మండలం పవరలో ట్రినిటి ఆస్పత్రిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధునాతన పరికరాలతో ఈ ఆసుపత్రి ఏర్పాటైందని అన్నారు. పేద ప్రజలకు మంచి సేవలు అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యుడు కౌశిక్‌హరి మాట్లాడుతూ, జిల్లాలోనే తొలిసారిగా క్యాన్సర్ వ్యాధిని వేగంగా గుర్తించి, నివారించే అధునాతన పరికరాన్ని తమ ఆసుపత్రిలో ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలో ఆరోగ్యశ్రీ పథకం కూడా వర్తింపజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు, సర్పంచ్ వీరంరెడ్డి ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రాంజీ, వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.